క్లుప్తంగా

యువకుడి అదృశ్యం

కోట : కోటకు చెందిన ముకేష్ కుమార్ అనే యువకుడు మూడు రోజులుగా కనిపించడం లేదని అతని తండ్రి గీసూలాల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. రాజస్థాన్‌కు చెందిన గీసూలాల్ కోటలో టీ దుకాణం నడుతున్నాడు. తండ్రి మందలించడంతో 18 ఏళ్ల ముకేష్‌కుమార్ కనిపించకుండా పోయినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. కాగా కనిపించకుండా పోయిన ముకేష్ కుమార్ ముంబయిలో ఉన్నట్లు ఆచూకీ లభించిందని రాజస్థాన్ వాసులు తెలిపారు. ఈ విషయమై ఎస్‌ఐకు సమాచారం ఇచ్చామన్నారు.

ఆవుల దాడి ఘటనపై ఆందోళన వద్దు

తిరుపతి తుడా : తిరుపతిలో ఆవులు దాడి చేసినట్లు అందులో ఇద్దరు వ్యక్తులు గాయపడినట్లు ఓ వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోందని, ఈ ఘటన తిరుపతిలో చోటుచేసుకున్నది కాదని నగర ప్రజలు ఎలాంటి ఆందోళన చెందవద్దని నగర పాలక సంస్థ మేయర్ డాక్టర్ శిరీష విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆమె శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ వీడియోను తిరుపతికి చెందిన కొందరు ముందు జాగ్రత్త కోసం కూడా సామాజిక మాధ్యమాల్లో వైరల్ చేస్తున్నట్లు తెలుస్తోందని పేర్కొన్నారు. ఆందోళన కలిగించే ప్రచారం మంచిది కాదని హితువు పలికారు. నగరంలో ఇలాంటి ఘటనలు జరగకుండా తగిన జాగ్రత్త చర్యలు తీసుకోవాలని కమిషనర్‌కు ఆమె సూచించినట్లు తెలిపారు. తిరుపతికి దేశ విదేశాల నుంచి భక్తులు వస్తున్న తరుణంలో వ్యక్తిగతంగా పశువులు పెంచుకునే వారు ఇష్టం వచ్చినట్లు రోడ్లపై వదిలి వేసే వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

ఈవీఎం గోదాంపై నిఘా


గోడౌన్‌ను తనిఖీ చేస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

రేణిగుంట : జిల్లాకు సంబంధించి ఈవీఎంలను భద్ర పరిచిన గోడౌన్ వద్ద నిరంతర నిఘా, పటిష్టమైన భద్రత ఉండాలని కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు త్రైమాసిక తనిఖీల్లో భాగంగా రేణిగుంట విమానాశ్రయం సమీపంలోని సెంట్రల్ వేర్ హౌసింగ్ గోడౌన్‌లో భద్రపరిచిన ఈవీఎంలను శుక్రవారం రాజకీయ పార్టీ ప్రతినిధుల సమక్షంలో కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గోదాములో భద్రపరిచిన ఈవీఎం యంత్రాలను అక్కడి భద్రతా ఏర్పాట్లను, సీసీ కెమెరాలు, సీలింగ్ తదితరాలను కలెక్టర్ క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం ఈవీఎం గోడౌన్ రిజిస్టర్‌లో సంతకం చేశారు. కార్యక్రమంలో ఈవీఎం గోడౌన్ ఇన్‌చార్జి, ఎస్డీసీ సుధారాణి, ఎన్నికల సెల్ సూపరింటెండెంట్ ప్రసాద్, రేణిగుంట తహశీల్దార్ చంద్రశేఖర్ రెడ్డి, రాజకీయ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

నిమ్మ.. కన్నీళ్ల చెమ్మ

- తెగుళ్లు సోకి దెబ్బతిన్న తోటలు
- పడిపోయిన దిగుబడులు
- ధరల్లేక రైతన్నల దిగాలు
- లబోదిబోమంటున్న అన్నదాతలు

సైదాపురం : మారిన వాతావరణ పరిస్థితుల కారణంగా ఉమ్మడి నెల్లూరు జిల్లాలో నిమ్మ తోటలకు తెగుళ్లు వ్యాపిస్తుండడంతో దిగుబడి గణనీయంగా తగ్గిపోయింది. కాయలున్న సమయాల్లో ధరలు లేక ధరలున్న సమయాల్లో కాయలు లేక నిమ్మ రైతులు ఏటా నష్టాలపాలవుతున్నారు.

వాతావరణ మార్పులతో..

మారిన వాతారణ పరిస్థితులకు నిమ్మకు నల్ల మచ్చలు, తదితర తెగుళ్ల వ్యాపించడంతో పంట భారీగా దెబ్బతింది. చెట్టు కాండం, ఆకులు, పిందెలు, చిన్నసైజు కాయలకు నల్లమచ్చలు ఏర్పడ్డాయి. కాయల సైజు పెరిగినా మచ్చలు అలాగే ఉంటున్నాయి. దీంతో మార్కెట్‌లో వీటిని కొనడం లేదు. ఆశించిన రీతిలో దిగుబడి వస్తున్నా పంటకు తెగుళ్ల సోకడంపై రైతులు ఆందోళన చెందుతున్నారు.

నల్లమచ్చలున్న కాయలు వదిలేస్తూ..

ప్రస్తుత పరిస్థితి కారణంగా నిమ్మ తోటలకు తెగుళ్ల విజృంభిస్తున్నాయి. మరో వైపు వర్షాల ప్రభావంతో 80 శాతం మేర కాయలు దెబ్బతిన్నాయి. వివిధ రకాల తెగుళ్ల సోకి తోటల్లో కాయలు దెబ్బతిన్నాయి. కాయలు కోసే సమయంలో అధికంగా మచ్చలు ఉన్న కాయలు ఉండడంతో వీటిని ప్రత్యేకంగా వేరు చేసి మార్కెట్‌కు తరలించాలంటే రైతులకు అదనపు భారంగా మారుతోంది. దీంతో రైతులు చేసేదేమిలేక నల్లమచ్చలున్న కాయలను పొలాల వద్ద, రోడ్డు పక్కన పారబోస్తున్నారు.

గిట్టుబాటు ధర లేక

ప్రస్తుతం మార్కెట్‌లో నిమ్మ ధరలు అంతంత మాత్రంగానే ఉన్నాయి. 2023-24లో కిలో 100 నుంచి 200 వరకు ధర పలికిన నిమ్మ నేడు 20 నుంచి 50 రూపాయలకు కూడా ధరలు పలకడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి నెల్లూరు జిల్లాలోని వెంకటగిరి, గూడూరు, సూళ్లూరుపేట నియోజకవర్గాల్లో సుమారు 15 వేల హెక్టార్లలో నిమ్మ సాగు చేస్తున్నారు. అయితే ఏటా నిమ్మ రైతులకు దురదృష్టం వెంటాడుతోంది.


సాగులో ఉన్న నిమ్మతోట


తెగుళ్లు వ్యాపించిన నిమ్మ చెట్లు

తోటల్లోనే వదిలేస్తున్నాం



కాయలున్న సమయాల్లో ధరలు లేక నష్టపోతున్నాం. ధరలున్న సమయాల్లో అసలు కాయలుండవు. దీంతో మరింత నష్టాలకు గురవుతున్నాం. దీనికి తోడు కాయలకు వివిధ రకాల తెగుళ్ల వ్యాపిస్తున్నాయి. కొన్ని కాయలకు వివిధ రకాల తెగుళ్ల సోకడంతో దెబ్బతిన్న కాయలను కొనేవారు లేరు. చేసేదే లేక నిమ్మ కాయలను తోటల్లో కోసి అక్కడే వదిలేస్తున్నాం.

– దామోదర్‌రాజు, నిమ్మ రైతు

తెగుళ్లతో నష్టపోతున్నాం



ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు నల్లమచ్చల తెగులు ఉధృతి అయింది. పంట దిగుబడిలో 30 శాతం మేర తెగుళ్లతో పంట దెబ్బతింది. మచ్చ లేని కాయలే మార్కెట్‌లో తీసుకుంటున్నారు. దీంతో దిగుబడి గణనీయంగా పడిపోయింది. ధరలు పుంజుకుంటున్న సమయంలో తెగుళ్లతో తీవ్రంగా నష్టపోతున్నాం.

– కేశవులు, నిమ్మరైతు

వడ్డీ వ్యాపారి నుంచి ఆటో ఇప్పించండి


బాధితురాలి భర్త శివ

చంద్రగిరి : రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ కార్పొరేషన్ ద్వారా తమకు అందించిన ఆటోను వడ్డీ వ్యాపారీ బలవంతంగా తీసుకున్నాడని, ఆయన ఆగడాల నుంచి రక్షించి, కుటుంబానికి జీవనాధారమైన ఆటోను తమకు ఇప్పించాలంటూ బాధితులు శుక్రవారం పోలీసులను ఆశ్రయించారు. బాధితుల వివరాల మేరకు.. మండల పరిధిలోని శేషాపురానికి చెందిన శివ భార్య నందినికి ఎస్సీ కార్పొరేషన్‌తో పాటు మహిళా సంఘాల ద్వారా సీఎం చంద్రబాబు చేతుల మీదుగా ఈ–ఆటోను పొందారు. అప్పటి నుంచి నందిని భర్త శివ ఆటో నడుపుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఈ క్రమంలో ఏ.రంగంపేటకు చెందిన పచ్చిపాల చైతన్య గతేడాది రూ.60 వేలను అప్పుగా తీసుకున్నాడు. ఆపై వడ్డీల రూపంలో సుమారు రూ.1.60 లక్షలు చెల్లించినట్లు తెలిపారు. అయితే కొంత వడ్డీతో పాటు అసలు చెల్లించడంలో జాప్యం జరిగిందన్నారు. దీంతో ఆగ్రహం వ్యక్తం చేస్తూ తమకు జీవనాధారమైన ఆటోను బలవంతంగా తీసుకున్నట్లుగా బాధితులు వాపోయారు. తమకు న్యాయం చేయాలంటూ వారు శుక్రవారం చంద్రగిరి పోలీసులను ఆశ్రయించారు.

బదిలీలు.. తమ్ముళ్లకు కాసులు

సచివాలయ బదిలీల్లో కూటమి సిఫార్సులు

రేణిగుంట : పనిచేస్తున్న మండలంలోనే ఉండేందుకు సచివాలయ ఉద్యోగులు తెలుగు తమ్ముళ్లను ఆశ్రయిస్తున్నారు. ఇదే అదునుగా సిఫార్సులు చేయడానికి అధిక మొత్తంలో డబ్బులు వసూలు చేస్తున్నట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం గ్రామ సచివాలయానికి సంబంధించి రేషలైజేషన్ ప్రక్రియ పూర్తయిన తర్వాత బదిలీల కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. మండలంలో పనిచేస్తున్న వెల్ఫేర్ అసిస్టెంట్లు మండలంలోనే పోస్టింగ్ తెచ్చుకోవాలని తెలుగు తమ్ముళ్లను ఆశ్రయించారు. ప్రతి పంచాయతీలో తెలుగు తమ్ముళ్ల సిఫార్సు చేసిన వెల్ఫేర్ అసిస్టెంట్ల జాబితాను ఉన్నతాధికారులకు పంపించారు. ఆ జాబితా ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఏ పంచాయతీ నుంచి ఎక్కడికి మారుతున్నారు? ఎవరు రెకమెండ్ చేస్తున్నారు అనేది స్పష్టంగా ఆ జాబితాలో ఉండటంతో అందరూ అవాక్కవుతున్నారు. డబ్బులు ఎంతైనా ఇస్తామని అడిగిన చోట పోస్టింగ్ ఇవ్వండని మండల స్థాయి నాయకుల ద్వారా ఎమ్మెల్యేతో సిఫారసు చేయించుకుంటున్నారు. సొంత మండలం బూచిగా చెప్పి డబ్బులు దోచుకుంటున్నట్లు విమర్శలు ఉన్నాయి.

ఆన్‌లైన్‌లో బదిలీలు

సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ల బదిలీల జాబితా ఆన్‌లైన్‌లో ఉన్నాయి. రాజకీయ నాయకుల సిఫార్సుల విషయం నా దృష్టికి రాలేదు. సొంత మండలంలో ఎటువంటి పరిస్థితుల్లో పోస్టింగ్ ఇవ్వడం జరగదు.

– ప్రభురావు, ఇన్‌చార్జి ఎంపీడీవో రేణిగుంట

ప్రభుత్వ స్థలం ఆక్రమణకు పచ్చనేతల దౌర్జన్యం

అడ్డుకున్న రెవెన్యూ అధికారులు


తిరుమలనగర్ పంచాయతీ తుడా క్వార్టర్స్‌లోని ప్రభుత్వ స్థలంలో అక్రమ నిర్మాణాలు చేపడుతున్న టీడీపీ నేతలు

తిరుపతి మంగళం /తిరుపతి అర్బన్ : తిరుపతి నగర, శివారు ప్రాంతాల్లో భూముల ధరలు ఆకాశానంటుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వ, పరంబోకు స్థలాలు కనిపిస్తే పచ్చనేతలు పాగవేసేస్తున్నారు.అందులో భాగంగానే మంగళం తిరుమలనగర్ పంచాయతీ పరిధిలోని తుడా క్వార్టర్స్, బొమ్మల క్వార్టర్స్‌లోని చెన్నాయగుంట లెక్క దాఖలాలు 195, 226 సర్వే నంబర్లలోని ప్రభుత్వ భూమిని ఆక్రమించేందుకు టీడీపీ నేతలు కొందరు శుక్రవారం ప్రయత్నించారు. ఏకంగా జేసీబీలతో గాడులు తీసి అక్రమ నిర్మాణాలు చేపట్టేందుకు యత్నించారు. విషయం తెలుసుకున్న రెవెన్యూ అధికారులు అక్కడికి చేరుకుని అక్రమ నిర్మాణాలను అడ్డుకున్నారు. అర్బన్ తహశీల్దార్ ఆదేశాల మేరకు వీఆర్వో ప్రసాద్ అక్రమ నిర్మాణాలను అడ్డుకుని జేసీబీలను అక్కడ నుంచి పంపివేశారు. 195, 226 సర్వే నంబర్లలోని స్థలం ప్రభుత్వానికి చెందిందని, అందులో ఎవరైనా ఆక్రమణలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. దీంతో టీడీపీ నాయకులు తమకు చంద్రగిరి ఎమ్మెల్యే నాని చెప్పారని, తమ వద్ద పట్టాలు ఉన్నాయని రెవెన్యూ అధికారులతో వాగ్వాదానికి దిగారు. అయితే మీ వద్ద ఉన్న పత్రాలను తహశీల్దార్‌కు చూపించి అనుమతి తీసుకుని నిర్మాణాలు చేసుకోవాలని రెవెన్యూ అధికారులు సూచించారు. అంత వరకు ఎలాంటి నిర్మాణాలు చేపట్టవద్దని హెచ్చరించి అక్కడ నుంచి పంపించి వేశారు.

కార్యదర్శుల పనితీరుపై ఆగ్రహం


కార్యదర్శులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న డీపీఓ సుశీలాదేవి

బుచ్చినాయుడుకండ్రిగ : గ్రామ పంచాయతీలలో పనిచేస్తున్న కార్యదర్శులు పనితీరు మార్చుకోవాలని లేకుంటే చర్యలు తప్పవని జిల్లా పంచాయతీరాజ్ శాఖ అధికారిణి సుశీలాదేవి హెచ్చరించారు. శుక్రవారం కారణి గ్రామంలో పర్యటించి, ఎంపీడీఓ కార్యాలయంలో కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వర్షాకాలం నేపథ్యంలో గ్రామాల్లో పారిశుద్ధ్యం మెరుగునకు చర్యలు చేపట్టాలని కోరారు. గ్రామాల్లో దోమల నివారణకు మురుగు నీటి నిల్వలు లేకుండా చూడాలన్నారు. మురుగు కాలువలను వెంటనే శుభ్రం చేయించి, వీధుల్లో బ్లీచింగ్ చేయించాలని, తాగునీటి ట్యాంకులను శుభ్రం చేసి క్లోరినేషన్ చేయాలన్నారు. తాగునీటి పైపులైన్ లీకేజీలను అరికట్టాలని, తాగునీటి సమస్యలు లేకుండా, వీధులలో గుంతలు ఉంటే పూడ్చాలని తెలిపారు. అధికారులు గ్రామాల్లో పారిశుద్ధ్యం మెరుగునకు చర్యలు చేపట్టకపోతే ఉపేక్షించేదేలేదన్నారు. ఈక్రమంలో ఈఓపీఆర్‌డీ రాజశేఖర్ పనితీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకటరత్నమ్మ, సర్పంచ్ పద్మమ్మ పాల్గొన్నారు.

తిరుమల ఘాట్ రోడ్డులో ప్రమాదం

- భక్తులకు స్వల్పగాయాలు


గాయపడిన మహిళ

తిరుమల : తిరుమల మొదటి ఘాట్ రోడ్డులో ఓ కారు బ్రేక్ ఫెయిల్ కావడంతో ముందు వెళుతున్న మరో కారును ఢీకొనడంతో భక్తులు గాయపడిన సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా.. తమిళనాడుకు చెందిన భక్తులు ఓ కారులో, తెలంగాణకు చెందిన భక్తులు మరో కారులో తిరుమల నుంచి తిరుపతికి మొదటి ఘాట్ రోడ్డు మీదుగా బయలుదేరారు. ఈ నేపథ్యంలో మొదటి ఘాట్ రోడ్డులోని రెండో మలుపు వద్ద తమిళనాడు కారు అదుపు తప్పి ముందు వెళుతున్న తెలంగాణ కారును ఢీకొంది. దీంతో కారు ముందు ఉన్న రక్షణ గోడను ఢీకొంది. ఈ ప్రమాదంలో రెండు వాహనాలలోని భక్తులు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. వెంటనే సమాచారం అందుకున్న ఘాట్ రోడ్డు భద్రతా సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదానికి గురైన వాహనాలను పక్కకు తొలగించి ట్రాఫిక్ పునరుద్ధరించారు. తమిళనాడుకు చెందిన భక్తుల కారు బ్రేక్ ఫెయిల్ కావడంతో ప్రమాదం చోటు చేసుకున్నట్లు సమాచారం. ప్రమాదంపై తిరుమల ట్రాఫిక్ పోలీసులు పరిశీలిస్తున్నారు.

దౌర్జన్యంగా గ్యాస్ గోదాం కూల్చివేత

గ్యాస్ సిలిండర్లు మాయం


గ్యాస్ గోదాము కూల్చిన ప్రదేశం

తడ : మండలంలోని తడకండ్రిగలో ఉన్న హెచ్‌పీ గ్యాస్ గోదామును గురువారం రాత్రి కొందరు వ్యక్తులు దౌర్జన్యంగా కూల్చి అందులోని సిలిండర్లను మాయం చేశారని గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకురాలు వినయ సుభాషిణి శుక్రవారం తడ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ ఫిర్యాదు మేరకు 2010లో ఎస్సీ కోటాలో సుభాషిణి గ్యాస్ ఏజెన్సీని తడలో ఏర్పాటు చేశారు. తడకండ్రిగకు చెందిన పులి వెంకటరమణారెడ్డి వద్ద తీసుకున్న నగదుకు సంబంధించిన లావాదేవీల్లో వివాదం జరుగుతూ ఉంది. ఇదే విషయమై ప్రస్తుతం గూడూరు కోర్టులో విచారణ జరుగుతోంది. ఇదిలా ఉండగా పులి వెంకట రమణారెడ్డి అల్లరి మూకల సాయంతో గోదామును స్వాధీనం చేసుకునేందుకు జూన్ 5వ తేదీ ఒకసారి, జూన్ 15వ తేదీన మరోసారి ప్రయత్నించగా అప్పట్లో దానిని అడ్డుకున్నట్టు ఫిర్యాదులో పేర్కొన్నారు. తాజాగా గురువారం రాత్రి గోదామును కూల్చిన ఘటనలో రమణారెడ్డి, అతని భార్య, కుమారుడు, కుటుంబ సభ్యులతోపాటు, స్థానికంగా ఉన్న కొందరు వ్యక్తుల ప్రమేయం ఉన్నట్టు గుర్తించామని సుభాషిణి వివరించారు. ఈ ఘటనలో గోదాములో ఉన్న 5 కిలోల సిలిండర్లు 38, 19 కిలోల సిలిండర్లు 23, 14.5 కిలోల సిలిండర్లు 323, 800 గ్యాస్ పైపులు, వీటితోపాటు గ్యాస్ ఆఫీసుకు చెందిన రికార్డులు కనిపించడం లేదని పేర్కొన్నారు. వీటి విలువ సుమారు రూ.10 లక్షలు ఉంటుందని, కూల్చిన గోదాము విలువ రూ.50 లక్షలని తెలిపారు. ఫిర్యాదు స్వీకరించిన పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కూల్చిన గోదాము ప్రదేశాన్ని సూళ్లూరుపేట సీఐ మురళీకృష్ణ పరిశీలించారు. సంఘటనా స్థలంలో పోలీస్ పికెట్ ఏర్పాటు చేశారు.

ప్రాణహాని ఉంది.. రక్షణ కల్పించండి

రాష్ట్ర సంగీత నృత్య అకాడమీ మాజీ చైర్‌పర్సన్


శిరీష

సైదాపురం : అక్రమ మైనింగ్‌దారులతో తనకు ప్రాణహాని ఉందని రక్షణ కల్పించాలంటూ రాష్ట్ర సంగీత నృత్య అకాడమీ మాజీ చైర్‌పర్సన్ శిరీష యాదవ్ జిల్లా పోలీసు ఉన్నతాధికారులను కోరారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ.. సైదాపురం మండలంలో జరుగుతున్న అక్రమ మైనింగ్‌పై చర్యలు తీసుకోవాలంటూ నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్‌కు తాము ఫిర్యాదు చేశామన్నారు. దీని దృష్టిలో ఉంచుకోని జిల్లా మైనింగ్ అధికారులతో పాటు అక్రమ మైనింగ్‌కు పాల్పడుతున్న కొందరు తమపై తప్పుడు కేసులతో పాటు ప్రాణహాని కలిగించేందుకు యత్నిస్తున్నారని ఆరోపించారు. అక్రమ మైనింగ్ చేసే వారి వల్ల తనకు ప్రాణహాని ఉందని రక్షణ కల్పించాలని ఉన్నతాధికారులను ఆమె కోరారు. జిల్లా ఎస్పీకి పత్రికా ముఖంగా విన్నవించుకుంటున్నట్లు ఆమె పేర్కొన్నారు.

హాస్టల్ విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు

తిరుపతి అర్బన్ : హాస్టల్స్‌లో చదువుకుంటున్న విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పిద్దామని బీసీ వెల్ఫేర్ జిల్లా అధికారి భరత్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఆయన ఎమ్మార్‌పల్లి సర్కిల్‌లోని బీసీ స్టడీ సర్కిల్‌లో హాస్టల్ వార్డన్స్‌తో పాటు సిబ్బందితో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఓ వైపు విద్యార్థుల చదువుకు ప్రాధాన్యం కల్పించడంతో పాటు మెనూ ప్రకారం నాణ్యమైన భోజన వసతులు కల్పించాలని ఆదేశించారు. ప్రధానంగా విద్యార్థులకు తాగునీటి నేపథ్యంలో వేడి నీరు అందుబాటులో ఉంచడం, వేడిగా ఆహారాన్ని వడ్డించడం, మెడికల్ కిట్ నిర్వహణ, ప్రతి నెలా ఆరోగ్య పరీక్షలు చేపట్టడం, నాణ్యమైన సరుకులతో వంటకాలు చేయడం తదితర అంశాలకు ప్రాధాన్యం ఇవ్వాలని ఆదేశించారు. కార్యక్రమంలో బీసీ వెల్ఫేర్ అధికారులు జ్యోత్స్న, మునేంద్ర పాల్గొన్నారు.

ఏపీ టూరిజానికి భూ కేటాయింపు

- ఎస్వీపురం పరిధిలో 12.70 ఎకరాలకు ఆమోదం

తిరుపతి అన్నమయ్య సర్కిల్ : టూరిజం ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రాజెక్టులను అభివృద్ధి చేసే క్రమంలో రాష్ట్ర ప్రభుత్వం తిరుపతి జిల్లాలో ఏపీ టూరిజం ఆథారిటీకి ఉచితంగా భూమి కేటాయింపునకు నిర్ణయం తీసుకుంది. వడమాలపేట మండలం ఎస్వీపురం పంచాయతీ పరిధిలో 12.70 ఎకరాల భూమిని అప్పగించేందుకు ఆమోద ముద్ర వేసింది. ఉచితంగా భూ కేటాయింపు ప్రతిపాదనపై మంత్రివర్గం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఎస్వీపురం సర్వే నంబరు 428–2లో 30 సెంట్లు అలాగే సర్వే నంబరు 428–3లో 12.40 ఎకరాల చొప్పున ఏపీ టూరిజం అథారిటీకి భూమిని బదిలీ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. తిరుపతిలో 5 స్టార్ హోటల్ నిర్మాణానికి ముందుకొచ్చిన మెస్సర్స్ పావని హోటల్స్ సంస్థకు అవసరమైన రాయితీ ఇచ్చేందుకు చేసిన ప్రతిపాదనలపై మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఈ 5 స్టార్ హోటల్ ఏర్పాటుతో సుమారు 250 మందికి ఉపాధి అవకాశాలు లభించనున్నట్లు పర్యాటక రంగ శాఖ అధికార యంత్రాంగం భావిస్తోంది. అదే విధంగా మిల్క్ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది.

పరిశ్రమల అభివృద్ధి ఉద్యోగాల కల్పనకు కృషి


వేదికపై మంత్రితోపాటు ప్రముఖులు

తిరుపతి అర్బన్ : సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల అభివృద్ధికి సాంకేతిక అంశాలను జోడించాలని రాష్ట్ర ఎంఎస్ఎం, సెర్ప్, ఎన్ఆర్ఐ సాధికారత సంబంధాలశాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ వెల్లడించారు. తిరుపతిలోని తాజ్ హోటల్‌లో శుక్రవారం ప్రపంచ సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల దినోత్సవాన్ని జరుపుకున్నారు. ఈ సందర్భంగా మంత్రితోపాటు రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు ఎస్‌పీ సోమనాథ్, రాష్ట్ర ఎంఎస్ఎం అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ తమ్మిరెడ్డి శివశంకర్‌రావు, కలెక్టర్ వెంకటేశ్వర్, రాష్ట్ర ఎంఎస్ఎంఈ అభివృద్ధి కార్పొరేషన్ సీఈఓ విశ్వ, తిరుపతి, సత్యవేడు ఎమ్మెల్యేలు ఆరణి శ్రీనివాసులు, కోనేటి ఆదిమూలం హాజరయ్యారు. కలెక్టర్ వెంకటేశ్వర్ మాట్లాడుతూ.. జిల్లాలో 1.80 లక్షల మంది ఎంఎస్ఎంఈల రంగంపై ఆధారపడి ఉన్నారని చెప్పారు.

శాస్త్రోక్తంగా ధ్వజారోహణం


పూజలు చేస్తున్న వేదపండితులు


ధ్వజారోహణంలో అధికారులు, భక్తులు

శ్రీకాళహస్తి : శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా పట్టణంలోని చెన్నై రోడ్డులో వెలసిన ద్రౌపతీ సమేత ధర్మరాజుల స్వామి ఆలయంలో శుక్రవారం ధ్వజారోహణ కార్యక్రమం శాస్త్రోక్తంగా జరిగింది. అంకురార్పణతో పూజలు ప్రారంభం అయ్యాయి. ఆలయ ప్రధాన అర్చకులు, వేదపండితుల ఆధ్వర్యంలో కలశ స్థాపన పూజలు శాస్త్రోక్తంగా చేపట్టారు. హోమ పూజలు చేశారు. అనంతరం ధ్వజస్తంభం వద్ద విశేష పూజలు చేశారు. కాగా ఉదయం ద్రౌపదీ సమేత ధర్మరాజస్వామి పుర ఉత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఈవో బాపిరెడ్డి, శ్రీకాళహస్తి, ఆలయ అధికారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో నాలుగు కార్లు ధ్వంసం


జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాద దృశ్యం

తడ: మండలంలోని చేనిగుంట గ్రామం వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో నాలుగు కార్లు దెబ్బతిన్నాయి. ఎవరికీ ఎలాంటి గాయాలు కాకపోవడంతో ఊపిరిపీల్చుకున్నారు. పోలీసుల కథనం మేరకు.. హైవే సిబ్బంది శుక్రవారం తడ–చెన్నై జాతీయ రహదారిలో చెట్లు తొలగిస్తున్నారు. ఈ క్రమంలో రోడ్డులో బారికేడ్లు అడ్డుగా పెట్టారు. కారు డ్రైవర్ వేగంగా వచ్చాడు. బారికేడ్లను గమనించి ఉన్నట్టుండి బ్రేక్ వేశాడు. దీంతో వెనుక వచ్చిన మరో కారు దాన్ని ఢీకొంది. కొద్ది సెకన్ల సమయంలోనే ఒకదాని వెనుక మరొకటి చొప్పున మొత్తం నాలుగు కార్లు ఢీకొని ఆగాయి. అదే సమయంలో గుమ్మిడిపూండికి లోడుతో వెళుతున్న టిప్పర్ ముందున్న కార్లను ఢీకొంది. ముందున్న రెండు వాహనాలు స్వల్పంగా దెబ్బతినగా మధ్యలో ఉన్న మూడు కార్లు బాగా దెబ్బతిన్నాయి. కార్లలో వారికి ఎలాంటి గాయాలు కాలేదు. సమాచారం అందుకున్న సూళ్లూరుపేట సీఐ మురళీకృష్ణ సిబ్బందిని పంపి వాహనాలను పక్కకు తొలగించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

దోమల నివారణ చర్యలు


మందు పిచికారీ చేస్తున్న వైద్య సిబ్బంది

వెంకటగిరి రూరల్ : వెంకటగిరి పట్టణంలోని పాతకోట పీహెచ్‌సీ వైద్యులు రాజేష్ ఆధ్వర్యంలో శుక్రవారం వైద్య సిబ్బంది ఆర్టీసీ బస్టాండ్, వసతి గృహాలు తదితర ప్రాంతాల్లో దోమల నివారణ చర్యలు చేపట్టారు. దోమలు నిల్వ ఉండే ప్రాంతాల్లో మందు పిచికారి చేశారు. నీరు నిల్వ ఉండకుండా చూడాలని స్థానికులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎం సత్య, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఇరుక్కుపోయిన తహసీల్దార్ కారు


కారును నెడుతున్న స్థానికులు

సైదాపురం: గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశాల మేరకు అధికారులు శుక్రవారం సైదాపురం మండలంలోని గనులను పరిశీలించేందుకు అధికారుల బృందం వచ్చింది. నెల్లూరు ఆర్డీవో నాగసంతోష్ అనూష, జిల్లా మైనింగ్, పర్యావరణ శాఖ అధికారులకు గనులున్న ప్రదేశాలను చూపించేందుకు తహసీల్దార్ సుభద్ర కారులో ముందుగా బయలుదేరారు. ఈ క్రమంలో ఆమె కారు బురదలో ఇరుక్కుపోయింది. దీంతో అక్కడి నుంచి అధికారులు కొంతమేర కాలి నడకన వెళ్లి గనులను పరిశీలించారు. చివరకు అక్కడున్న స్థానికులు కారును నెట్టి బయటకు తీశారు.

మాదకద్రవ్యాలతో జీవితాలు నాశనం

కలువాయి(సైదాపురం) : మాదకద్రవ్యాల వినియోగం వల్ల అనేక అనర్థాలు కలుగుతాయని కలువాయి మండలంలో బీవీఎస్‌ఆర్ జెడ్పీ హైస్కూల్ ఎన్‌సీసీ అధికారి జి.పెంచల పుల్లయ్య తెలిపారు. ఆయన శుక్రవారం 24వ ఆంధ్ర బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ డి.కరంచంద్ ఆదేశాల మేరకు ఎన్‌సీసీ విద్యార్థులతో కలిసి మాదకద్రవ్యాల నియంత్రణపై అవగాహన ర్యాలీ చేపట్టారు. ఆయన మాట్లాడుతూ యువత మత్తుకు దూరంగా ఉండాలన్నారు. మాదకద్రవాలతో జీవితాలు నాశనం అవుతాయని వివరించారు.

వ్యభిచారం జరుగుతున్న లాడ్జీపై దాడి

నాయుడుపేట టౌన్ : పట్టణంలోని శ్రీకాళహస్తి బైపాసు రోడ్డు సమీపంలో ఉన్న లాడ్జీలో వ్యభిచారం జరుగుతున్న సమాచారంపై శుక్రవారం రాత్రి సీఐ బాబీ పోలీసులతో తనిఖీ చేపట్టారు. లాడ్జీ వద్ద ఉన్న మహిళతో పాటు నిర్వాహకులైన లాడ్జీ యజమాని జయరామయ్యను అదుపులోకి తీసుకున్నట్లు సీఐ వెల్లడించారు. ఇతర ప్రాంతాల నుంచి మహిళలను తీసుకొచ్చి వ్యభిచారం నిర్వహిస్తున్నట్లు గుర్తించినట్లు సీఐ చెప్పారు. లాడ్జీ యజమానిపై కేసు నమోదు చేసినట్లు సీఐ వివరించారు.

ప్రమాదంలో యువకుడి దుర్మరణం


మృతుడు సాయి (ఫైల్)

చిల్లకూరు : మండలంలోని కడివేడు సమీపంలో శుక్రవారం రాత్రి గుర్తుతెలియని వాహనం ఢీకొని యువకుడు దుర్మరణం చెందాడు. పోలీసుల కథనం మేరకు.. కమ్మవారిపాళెం గ్రామానికి చెందిన సాయి (30) బైక్‌లో గూడూరు వెళ్లాడు. పనులు ముగించుకుని శుక్రవారం రాత్రి ఇంటికి బయలుదేరాడు. కడివేడు సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. స్థానికుల సమాచారంతో పోలీసులు అక్కడికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని గూడూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతునికి భార్య, కుమారుడు ఉన్నారు.

నీటి వృథా


వృథాగా పోతున్న నీరు

సైదాపురం మండలం పోతేగుంట సమీపంలోని తెలుగు గంగ బ్రాంచ్ కాలువ వద్ద నీరు వృథా అవుతోంది. దానికి గేట్ వాల్వు బిగించి నీటి వృథాను అరికట్టాలని పలు గ్రామాల రైతులు కోరుతున్నారు. పోతేగుంట వద్ద ఉన్న కాలువ నుంచి తిప్పిరెడ్డిపల్లి, తోకలపూడి, కమ్మవారిపల్లి, లింగసముద్రం, అనంత మడుగు, రాగనరామాపురం గ్రామాల్లోని పొలాలకు నీరు అందుతుంది. ఈ నీటితో సుమారు 750 ఎకరాల్లో పంటలు సాగవుతున్నాయి. నీరు వృథాగా పోతుండడంతో పొలాలకు నీరు అందడం లేదని రైతులు వాపోతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి కాలువకు గేట్ వాల్వు బిగించాలని కోరుతున్నారు.

– సైదాపురం

నిర్లక్ష్యం



విద్యుత్ వృథాను అరికట్టాలని అధికారులు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఆచరణలో మాత్రం విఫలమవుతున్నారు. మండలంలోని అక్కరపాక, వెదురుపట్టు, మీజూరు, కల్లూరు, తల్లంపాడు తదితర గ్రామాల్లో వీధి దీపాలు రేయింబవళ్లు వెలుగుతూనే వున్నాయి. వాటికి స్విచ్‌లు ఏర్పాటు చేయాల్సిన పంచాయతీ అధికారులు పట్టించుకోకుండా వదిలేశారు. ఇలా నిరంతరం వెలుగుతూనే వుండడంతో బల్బులు పాడవుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి వీధి దీపాలకు స్విచ్‌లు ఏర్పాటుచేసి విద్యుత్ వృథాను అరికట్టాలని కోరుతున్నారు.

– దొరవారిసత్రం

శిథిలావస్థలో భవనం



మండలంలోని అక్కరపాకలోవున్న అంగన్‌వాడీ భవనం శిథిలావస్థకు చేరింది. పైకప్పు పెచ్చులు ఊడి కింద పడుతున్నాయి. దీంతో పిల్లలు, అంగన్‌వాడీ సిబ్బంది భయాందోళన చెందుతున్నారు. ఐసీడీఎస్ అధికారులు కొత్త భవనం నిర్మాణానికి ప్రతిపాదనలు పంపించి చేతులు దులుపుకున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.

– దొరవారిసత్రం

మున్సిపల్ కార్యాలయ స్థలం స్వాధీనం

నాయుడుపేట టౌన్ : పట్టణంలోని రెవెన్యూ కార్యాలయం శిథిలావస్థకు చేరుకోవడంతో విన్నమాల గ్రామ సమీపంలో నూతన భవనాలను నిర్మించారు. అక్కడికి కార్యాలయాన్ని తరలించారు. పాత రెవెన్యూ కార్యాలయానికి సంబంధించిన 43 సెంట్ల స్థలాన్ని మున్సిపల్ కార్యాలయ నిర్మాణానికి కేటాయించారు. ఈ క్రమంలో మున్సిపల్ అధికారులు శుక్రవారం భవనాల తొలగింపు పనులు చేపట్టారు. కమిషనర్ షేక్ ఫజులుల్లా, ఆర్ఐ ఖాశీం, వర్క్ ఇన్‌స్పెక్టర్లతో కలిసి పనులను పరిశీలించారు. కమిషనర్ మాట్లాడుతూ ప్రస్తుతం రూ.5 లక్షలతో రేకుల షెడ్డు నిర్మిస్తామన్నారు. పాత భవనాల్లో ఉన్న వస్తువులను అందులో పెట్టి పురాతన భవనాలను పూర్తిగా తొలగిస్తామని వెల్లడించారు. మున్సిపల్ కార్యాలయ భవన నిర్మాణానికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించామని, నిధులు మంజూరుకాగానే పనులు ప్రారంభిస్తామని వివరించారు.


భవనాలను తొలగింపు పనులు పరిశీలిస్తున్న కమిషనర్ ఫజులుల్లా, ఆర్ఐ

వాతావరణంలో మార్పులతో పంటలకు తెగుళ్లు

వాకాడు : బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా వాతావరణంలో పలు మార్పులు చోటుచేసుకుని పంటలకు తెగుళ్ల సోకుతున్నాయి. మండలంలో దాదాపు 1500 హెక్టార్లలో ఎడగారు పంటలు సాగయ్యాయి. పలు గ్రామాలలో సాగు నీటి కొరత ఉన్నప్పటికీ కొందరు రైతులు బోరు నీటి ఆధారంగా పంటలు సాగు చేస్తున్నారు. గత వారం రోజులుగా వాతావరణంలో మార్పులు రావడంతో పంటలకు తెల్ల తెగుళ్లు, మైట్స్, మోముపిప్పి, నల్లమచ్చ తదితర తెగుళ్ల సోకుతున్నాయి. దీంతో రైతులు ప్రయివేట్ పురుగు మందుల షాపుల వద్దకు పరుగులు తీస్తున్నారు. పంటలపై వివిధ రకాల పురుగు మందులు అధిక మోతాదులో వెదజల్లుతున్నారు. ఫలితంగా గతంలోకంటే ఈసారి పెట్టుబడులు పెరిగినట్టు రైతులు వాపోతున్నారు. గతంలో రైతు భరోసా కేంద్రాల్లో అన్ని రకాల పురుగు మందులు, ఎరువులు సబ్సిడీతో అందుబాటులో ఉండేవని రైతులు చెబుతున్నారు. అంతేగాక పంటలకు సోకే తెగుళ్ల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై అధికారులు సలహాలు ఇచ్చేవారని పేర్కొంటున్నారు. ఇప్పుడు ఆ దిశగా అధికారులు చర్యలు తీసుకోవడం లేదని వాపోతున్నారు.


పురుగు మందు పిచికారీ చేస్తున్న రైతులు

విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలి

గూడూరు రూరల్ : విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని ఎన్‌ఆర్‌ఐలు సన్నారెడ్డి నిరీష, సన్నారెడ్డి నిష్యా కోరారు. వారు శుక్రవారం గూడూరు పట్టణం సంయుక్తనగర్‌లో ఉన్న శ్రీసరస్వతి శిశుమందిరాన్ని సందర్శించారు. వారు మాట్లాడుతూ శిశు మందిరం విద్యార్థులు అన్ని రంగాల్లోనూ రాణిస్తున్నారని తెలిపారు. చిన్న వయసులోనే సంస్కృత శ్లోకాలు, దేశభక్తి గీతాలు ఆలపించడం అభినందనీయమన్నారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పాఠశాల అధ్యక్షుడు మల్లెమాల మురళీరెడ్డి, ప్రధాన కార్యదర్శి మయూరి శ్యామ్ యాదవ్, వంగా ప్రసాద్‌రెడ్డి, ప్రవీణ్ కృష్ణారెడ్డి, హెచ్‌ఎం రంగనాయకులు తదితరులు పాల్గొన్నారు.


బహుమతులు అందజేస్తున్న ఎన్‌ఆర్‌ఐలు నిరీష, నిష్యా

తగ్గిన నిమ్మ ధరలు

చిల్లకూరు : గూడూరులోని నిమ్మకాయల మార్కెట్‌లో కాయల ధరలు భారీగా పడిపోవడంతో రైతులు లబోదిబోమంటున్నారు. ప్రస్తుతం నిమ్మ కాయల దిగబడి పెరిగింది. ఎగుమతులు జరిగే ప్రాంతాల్లో ధరలు లేకపోవడంతో ఇక్కడి వ్యాపారులు కూడా ధరలు తగ్గించేశారు. వేసవి సీజన్‌లో కాయలు అంతంత మాత్రంగానే దిగబడి రాగా ఇప్పుడు కాయలు బాగానే వస్తున్నాయి. ఢిల్లీ ప్రాంతంలో వర్షాలు కురవడంతో ధరలు బాగా తగ్గిపోయాయని వ్యాపారులు చెబుతున్నారు. శుక్రవారం నిమ్మ మార్కెట్‌లో ఏ గ్రేడ్ నిమ్మకాయలు ధర కేజీ రూ.13 నుంచి రూ.16 వరకు పలికింది. ధరలు ఇలాగే కొనసాగితే పెట్టుబడులు కూడా అందవని రైతులు వాపోతున్నారు.


గ్రేడింగ్ చేసిన నిమ్మ కాయలు

ఏపీటీఎఫ్ సభ్యత్వ నమోదు

కలువాయి(సైదాపురం) : ఏపీటీఎఫ్ నాయకులు శుక్రవారం కలువాయి మండలంలోని కుల్లూరు, దాచూరు, చీపినాపి, కలువాయి, పెన్నబద్దవోలు కాంప్లెక్స్ పరిధిలోని పాఠశాలల్లో సభ్యత్వ నమోదు చేపట్టారు. మండల ప్రధాన కార్యదర్శి జీవీ మురళీకృష్ణ మాట్లాడుతూ ప్రస్తుతం 80 మంది సభ్యత్వం నమోదు చేసుకున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ అధ్యక్షులు నాప నాగరాజు, కే దిలీప్ కుమార్, రవి, రాజా, రఫీ, రాజేష్, శ్రీనివాసులు, వీరేంద్ర, కిరణ్, జీవి కిషోర్ పాల్గొన్నారు.


సభ్యత్వ నమోదు చేస్తున్న ఉపాధ్యాయులు

రసాభాసగా టీడీపీ సంస్థాగత ఎన్నికలు

నాయుడుపేట టౌన్ : నాయుడుపేట పట్టణం శ్రీకాళహస్తి బైపాస్ రోడ్డులోని శ్రీనివాస కల్యాణ మండపంలో శుక్రవారం చేపట్టిన టీడీపీ మండల అధ్యక్షులు, గ్రామ కమిటీల ఎన్నికల ప్రక్రియ రసాభాసగా మారింది. సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ అధ్యక్షతన పార్టీ నియోజకవర్గ పరిశీలకులు జెడ్ శివప్రసాద్, ఓజిలి మండల పరిశీలకులు బీ రాజేశ్వరరావు సారథ్యంలో ఓజిలి మండల సంస్థాగత ఎన్నికల ప్రక్రియను ప్రారంభించారు. కొంతమంది నాయకులు వాగ్వాదానికి దిగారు. ఒక వర్గానికే ప్రాధాన్యం ఇస్తున్నారని ఆరోపించారు. నాయకులు సర్ది చెప్పినా వినలేదు. దీంతో సమావేశం ముగిస్తున్నట్లు ప్రకటించారు. అదేవిధంగా పార్టీ పెళ్లకూరు మండల అధ్యక్షుడి ఎంపికలోనూ వివాదం చోటు చేసుకునే పరిస్థితి నెలకొనడంతో వాయిదా వేశారు. శనివారం ఉదయం సూళ్లూరుపేట పట్టణంలోని పార్టీ కార్యాలయంలో, సాయంత్రం తడలోని వీపీఆర్ కార్యాలయంలో తడ మండల పార్టీ అధ్యక్షులు, గ్రామ కమిటీల ఎన్నిక నిర్వహించనున్నారు.

పరిసరాల శుభ్రతతోనే ఆరోగ్యం

వెంకటగిరి రూరల్ : పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం వల్ల ఆరోగ్యంగా ఉండొచ్చని ఎంపీడీవో గుణశేఖర్ తెలిపారు. ఆయన శుక్రవారం లాలాపేట, పాలెంకోట, సోమసానిగుంట, పాపమాంబపురం గ్రామాల్లో పర్యటించారు. ఆయన మాట్లాడుతూ చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయవద్దని స్థానికులకు సూచించారు. తడి, పొడిచెత్తను వేర్వేరుగా సేకరించి చెత్త నుంచి సంపద తయారీ కేంద్రానికి తరలించాలని సూచించారు. గ్రామాల్లో మురుగు కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో కేవీ రమణయ్య, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.


గ్రామాల్లో పర్యటిస్తున్న ఎంపీడీవో గుణశేఖర్

వైఎస్సార్‌సీపీలో మైనార్టీలకు సముచిత స్థానం

చిల్లకూరు : వైఎస్సార్‌సీపీలో మైనార్టీలకు సముచిత స్థానం లభించిందని ఆ పార్టీ గూడూరు నియోజకవర్గ సమన్వయకర్త, ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ తెలిపారు. ఆయన శుక్రవారం గూడూరులోని తన నివాసంలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో గ్రామ కమిటీల ఏర్పాటుపై సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి ముస్లింలకు రిజర్వేషన్‌లు కల్పించి ఆదుకున్నారని గుర్తు చేశారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కూడా ముస్లింల సంక్షేమానికి కృషి చేశారని తెలిపారు.

అభివృద్ధి పనులు చేస్తుంటే అడ్డుకుంటారా..?

గత ప్రభుత్వ హయంలో గెలుపొందిన సర్పంచులు తమ గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టేందుకు కూటమి నాయకులు సహకారం అందించడం లేదని ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. నాలుగు రోజుల క్రితం ఓడూరు పంచాయతీలో సర్పంచ్ శారదమ్మ ఆధ్వర్యంలో శ్మశానంలో గ్రావెల్ తోలి అభివృద్ధి పనులు చేపట్టారని తెలిపారు. కూటమి నాయకుల ఒత్తిడితో పోలీసులు రెండు ట్రాక్టర్లు, జేసీబీని స్వాధీనం చేసుకుని ఇబ్బంది పెట్టడం ఎంతవరకు సబబని ప్రశ్నించారు. ఇకనైనా గ్రామాల్లోని కూటమి నాయకులు ఆయా గ్రామ పంచాయతీల్లో ప్రజాప్రతినిధులు చేపట్టే అభివృద్ధి పనులకు సహకారం అందించాలని హితవుపలికారు. అనంతరం వైఎస్సార్‌సీపీ మైనార్టీ విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధిగా రెండో పర్యాయం ఎంపికైన మగ్దూమ్ మొహిద్దీన్‌ను సత్కరించారు. మగ్దూం మాట్లాడుతూ రెండవ పర్యాయం తనను ఎంపిక చేసేందుకు సహకారం అందించిన తిరుపతి ఎంపీ గురుమూర్తి, మైనార్టీ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు ఖాదర్‌బాషా, ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు ఆల్తాఫ్, జహీర్, సుభాన్, సలీం పాల్గొన్నారు.


ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్‌ను సత్కరిస్తున్న మగ్దూం మొహిద్దీన్ తదితరులు

సామూహిక సెలవుకు అనుమతి ఇవ్వండి

చిల్లకూరు /గూడూరు రూరల్ : పనిభారం పెరగడంతో ఇబ్బంది పడుతున్నామని, సామూహిక సెలవు పెట్టేందుకు అనుమతి ఇవ్వాలని గూడూరు డివిజన్‌లోని పంచాయతీ కార్యదర్శులు కోరారు. వారు శుక్రవారం గూడూరు డీఎల్‌డీవో వాణిరెడ్డికి వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ పంచాయతీల్లో చేపట్టే ప్రతి కార్యక్రమాన్నీ కార్యదర్శులకు ముడి పెడుతున్నారని తెలిపారు. దీంతో క్షణం కూడా తీరికలేకుండా పోతోందని వాపోయారు. ప్రతి రోజూ ఉదయాన్నే చెత్త సంపద తయారీ కేంద్రాల వద్దకు వెళ్లి అక్కడి నుంచి ఫొటో అప్‌లోడ్ చేయాల్సి వస్తోందని తెలిపారు. 12 గంటల పాటు పారిశుద్ధ్య పనులు చేయించడం, సచివాలయం, ఇతర విధులకు సమయం కేటాయించాల్సి వస్తోందన్నారు. దీంతో కుటుంబ అవసరానికి కనీస సమయం కేటాయించలేక పోతున్నామని తెలిపారు. పని ఒత్తిడితో దీర్ఘకాలిక అనారోగ్యాల బారిన పడుతున్నట్టు వివరించారు. ఈ క్రమంలోనే సామూహిక సెలవుకు అనుమతి కోరుతూ వినతి పత్రం అందజేస్తున్నామని తెలిపారు. డీఎల్‌డీవో మాట్లాడుతూ ఉన్నతాధికారులకు సమాచారం ఇస్తామని తెలిపారు.


డీఎల్‌డీవోకు వినతి పత్రం అందజేస్తున్న పంచాయతీ కార్యదర్శులు

ఊనుగుంటపాళెం పీఏసీఎస్‌కు గుర్తింపు

కోట: మండలంలోని ఊనుగుంటపాళెం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘానికి జాతీయ స్థాయి ఎన్‌సీడీసీ గుర్తింపు లభించిందని సొసైటీ ఈవో శ్రీనివాసులురెడ్డి తెలిపారు. పీఏసీఎస్ పరిధిలో 1,180 మంది రైతులు ఉన్నట్లు తెలిపారు. వారికి సొసైటీ ద్వారా అందజేస్తున్న సేవలను ఎన్‌సీడీసీ గుర్తించినట్లు తెలిపారు. రైతులకు రుణాల మంజూరు, రికవరీలో పురోగతి సాధించామన్నారు. ఎన్‌సీడీసీ గుర్తింపుతో కేంద్ర ప్రభుత్వం నిధులు వచ్చే అవకాశం ఉందన్నారు. రైతుల అభివృద్ధికి మరింత రుణాలు పొందే అవకాశం కలుగుతుందన్నారు.

కండలేరులో 33.986 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో శుక్రవారం నాటికి 33.986 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ గజేంద్రరెడ్డి తెలిపారు. కండలేరు నుంచి సత్యసాయి గంగ కాలువకు 2,040, పిన్నేరు కాలువకు 10, లోలెవల్ కాలువకు 70, హైలెవల్ కాలువకు 20, మొదటి బ్రాంచ్ కాలువకు 85 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు.

తాగునీటి బోర్లు ఏర్పాటు

పెళ్లకూరు : మండలంలోని చిల్లకూరు, పెన్నేపల్లి గ్రామాల్లో ప్రజల దాహార్తిని తీర్చేందుకు ఆయా గ్రామాల సర్పంచుల ఆధ్వర్యంలో శుక్రవారం బోర్లు వేశారు. ఒక్కో తాగునీటి బోరుకు జెడ్పీ నిధులు రూ.1.20 లక్షలు మంజూరైనట్టు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మనోజ్‌కుమార్ తెలిపారు. ఈ క్రమంలో బోర్లు వేసినట్టు తెలిపారు. గ్రామాల్లో నీటి ఎద్దడి లేకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు.


పెన్నేపల్లిలో తాగునీటి బోరు వేస్తున్న సిబ్బంది

ఎన్‌సీసీ క్యాడెట్లకు ఫైరింగ్‌లో శిక్షణ

కోట: విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఐఎస్టీలో చేపట్టిన ఎన్‌సీసీ నావల్ యూనిట్ వార్షిక శిక్షణ శిబిరంలో శుక్రవారం ఎన్‌సీసీ క్యాడెట్లకు పలు అంశాల్లో పోటీలు నిర్వహించారు. ఫైరింగ్ శిక్షణలో పురుషుల విభాగంలో రాంబాబు, వివేకానంద కళాశాల, మహిళల విభాగంలో మంజూష, వివేకానంద కళాశాల, హర్షిణి నారాయణ కళాశాల ప్రతిభ చూపినట్లు క్యాంప్ కమాండింగ్ ఆఫీసర్ గణేష్ గొడంగవే తెలిపారు.

వాహనాల దారి మళ్లింపు

గూడూరు రూరల్ : ట్రాఫిక్ క్రమబద్ధీకరణలో భాగంగా శుక్రవారం ఉదయం నుంచి గూడూరు రెండో పట్టణ పరిధిలోని జీఎస్.రాయలు కూడలి నుంచి అంబేడ్కర్ నగర్ సమీపంలో ఉన్న రెండో అండర్ బ్రిడ్జి ద్వారా వాహనాల దారి మళ్లించారు. అదేవిధంగా మొదటి అండర్ బ్రిడ్జి నుంచి కాకుండా ఎస్‌ఆర్‌ఏ టాకీస్ మీదుగా వాహనాల రాకపోకలు సాగించాలని రెండో పట్టణ సీఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది అవగాహన కల్పించారు. పట్టణంలో ట్రాఫిక్ నియంత్రణకు ప్రజలందరూ సహకరించాలని కోరారు. అలాకాకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కేసులు నమోదు చేస్తామన్నారు.

రేపు వెంకటగిరికి నేదురుమల్లి రాక

వెంకటగిరి రూరల్ : వైఎస్సార్ సీపీ వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి ఆదివారం వెంకటగిరికి రానున్నట్లు ఆ పార్టీ పట్టణ కన్వీనర్ పులి ప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి పార్టీ కార్యకర్తలు, నాయకులకు అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు.

నేడు విద్యుత్‌కు అంతరాయం

నాయుడుపేట టౌన్ : నాయుడుపేటలోని తుమ్మూరు 11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు చేస్తున్నందున శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నట్లు ఏఈ ఎస్.శివశంకర్ తెలిపారు. నాయుడుపేట పట్టణంతో పాటు తుమ్మూరు, చంద్రబాబు కాలనీ, కుమ్మరి వీధి, బేరిపేట, రజక కాలనీ, మార్కెట్ వీధి, ప్రభుత్వ వైద్యశాల ఏరియా, దర్గా రోడ్, రాజగోపాలపురం, శ్రీరామ్ నగర్, అశోక్ నగర్, బజారు వీధి, గిండివారి తోట, గరిడీ వీధి, ఆర్టీసీ బస్టాండు తదితర ప్రాంతాల్లో విద్యుత్ ఉండదని వెల్లడించారు.

చిల్లకూరు : గూడూరు పరిధిలోని గాంధీనగర్‌లో ఉన్న 33/11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్‌లో మరమ్మతులు చేస్తున్నందున శనివారం విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నట్టు డీఈఈ ప్రసాద్ తెలిపారు. మాళవ్యానగర్, ఇందిరానగర్, గాంధీనగర్ 11 కేవీ ఫీడర్ల పరిధిలో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

1న మహావిష్ణువు ఆలయ వార్షికోత్సవం

రాపూరు: మండలంలోని మద్దెలమడుగు వద్ద ఉన్న మహావిష్ణువు, అయ్యప్పస్వామి ఆలయాల వార్షికోత్సవాన్ని జూలై 1న ఘనంగా నిర్వహించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. స్వామివారికి ఉదయం 5 గంటలకు అభిషేకం, 6 గంటలకు పూలంగి సేవ, 10.30 గంటలకు శ్రీదేవి, భూదేవి సమేత మహావిష్ణువుకు కల్యాణం, మధ్యాహ్నం అన్నదానం, సాయంత్రం శ్రీదేవి, భూదేవి సమేత మహావిష్ణువు, అయ్యప్ప స్వాముల గ్రామోత్సవం నిర్వహిస్తామన్నారు.